సాక్షి పెద్దపల్లి

మంగళవారం : 4 : ఏప్రిల్ : 2023



ప్రజా'వాణి' వినండి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఏకరువు పెట్టారు. 8లో▸



పత్తి క్వింటాల్‌కు రూ.7,431

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పత్తి క్వింటాల్‌కు రూ.7,431 పలికింది. కనిష్టంగా రూ.6511, సగటున రూ.7,351గా నిర్ణయించారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.0/25.0

వాతావరణం

ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

నిరాశావాది తనకు వచ్చిన అవకాశంలో కష్టాన్ని చూస్తే, ఆశావాది కష్టంలో అవకాశం కోసం వెతుకుతాడు.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6:33	బుధ 4:42

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సజావుగా 'సబార్డినేట్' పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి(మంథని): రామగిరిలోని జేఎన్టీయూలో సోమవారం నిర్వహించిన జ్యుడిషియల్ మినిస్ట్రీరియల్ సబార్డినేట్ సర్వీస్ పరీక్ష సజావుగా సాగింది. పరీక్షను మూడు సెషన్స్‌లలో నిర్వహించారు. మొత్తం 312 మంది అభ్యర్థులకు గాను 215 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ తెలిపారు. పరీక్షను మంథని సబ్ జడ్జి భారతి పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని దివ్యాంగుల నిర్ధారణకు మంగళవారం మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని డీఆర్‌డీఓ శ్రీధర్ తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారితోపాటు తాత్కాలిక సర్టిఫికెట్ ఉన్నవారు రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శారీరక వైకల్యంగల వారు ఈనెల 6, 20 తేదీల్లో జరిగే శిబిరాలకు స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. దృష్టిలోపం ఉన్నవారు ఈనెల 13, మానసిక వైకల్యం, బుద్ధిమాంద్యం ఉన్నవారు 19, వినికిడి లోపం గలవారు 27కు స్లాట్ బుక్ చేసుకోవాలని వివరించారు. క్యాంపులకు వచ్చే దివ్యాంగులు రశీదుతోపాటు నిర్ధారణ లేఖ, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, మెడికల్ రిపోర్టులను వెంట తెచ్చుకోవాలని కోరారు.

భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



మేడారంలో భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నందిమేడారంలో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి భవన పనులను ఆయన సోమవారం పరిశీలించారు. బొట్లవనపర్తిలో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం 30 పడకల ఆసుపత్రి మంజూరు చేసి నిధులు కేటాయించిందన్నారు. ఆ పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు సామంతుల జానకీ, రెడపాక ప్రమీల, ఎంపీటీసీలు మోతె సుజాత, మిట్ట తిరుపతి, కట్ట సరోజన పాల్గొన్నారు.





జిల్లాకేంద్రంలోని ఓ పాఠశాల వద్ద విద్యార్థుల సందడి..

'పది' పరీక్షలు ప్రారంభం

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు: జిల్లాలో పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. 47 కేంద్రాల్లో 7,936 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 11 మంది గైర్హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు. రాష్ట్రస్థాయి అబ్జర్వర్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 17 కేంద్రాలను పర్యవేక్షించాయి. ఎలిగేడు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని డీఈవో మాధవి తనిఖీ చేశారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



బాగారాయాలి ఫ్రెండ్..: స్నేహితుల కరచాలనం



తనిఖీలు చేసి కేంద్రంలోకి పంపిస్తూ..



పోలీసు పోస్టింగుల కాలం!

ప్రతిభావంతులకు పట్టంగట్టే పనిలో ప్రభుత్వం

- నేతల లేఖల కోసం ఖాకీల ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న పైరవీలు
- ఏసీపీ నుంచి ఎస్సైల దాకా బదిలీకి యత్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పోలీసుల బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరో ఐదారు నెలల్లో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమరం జరగబోతున్న నేపథ్యంలో ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పూర్తిచేసింది. ఇక తరువాత స్థాయిలో ఉన్న ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్– ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారుల బదిలీలపై కొంతకాలంగా హోంశాఖ కసరత్తు చేస్తోంది. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్ కమిషనరేట్, రామగుండం కమిషనరేట్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో కిందిస్థాయిలో ఎస్సైల బదిలీలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇక కీలకమైన సీఐ, ఏసీపీల బదిలీల విషయంలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎవరిని ఎక్కడ నియమించాలన్న విషయంలో ఇటు ఉన్నతాధికారులు, అటు హోంశాఖ పకడ్బందీగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం అధికారుల ట్రాక్ రికార్డుతోపాటు, సమర్థతపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం.

మూడేళ్ల నిబంధన కీలకం..!

క్రితంసారి జరిగినట్లు ఈసారి అసెంబ్లీ ఎన్నికలు వన్‌సైడ్‌గా జరిగే అవకాశాలు చాలా తక్కువ. అధికార పార్టీకి ప్రతిపక్షాల నుంచి పోటీ అధికంగా ఉండే అవకాశాలున్నాయి. ఇదే సమయంలో ఎన్నికలలో సున్నితమైన, కీలకమైన నియోజకవర్గాల్లో ప్రతిభావంతులైన అధికారులకు పోస్టింగులు ఇవ్వాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ నియామకాన్ని రద్దు చేస్తూ.. కేంద్రం ఆయన్ని ఏపీ కేటాయించింది. దీంతో ప్రభుత్వం డీజీపీ విషయంలోనూ ఆచితూచి వ్యవహరించి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలే అప్పగించింది. ప్రస్తుతం కేంద్రం –రాష్ట్రం మధ్య పరస్పర రాజకీయ ఆధిపత్య పోరు తీవ్రమైన నేపథ్యంలో పోస్టింగుల విషయంలో ఎక్కడా సాంకేతిక పరమైన లోపాలు, పొరబాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అందుకే.. ఇటీవల జరిగిన ఐఏఎస్, ఐపీఎస్‌ల విషయంలోనూ జాగరుకతతో వ్యవహరించింది. ఇందులో భాగంగానే.. కరీంనగర్ సీపీగా సుబ్బారాయుడు, రామగుండం సీపీగా రెమా రాజేశ్వరి, సిరిసిల్ల ఎస్పీగా అఖిల్‌మహాజన్, జగిత్యాల ఎస్పీగా భాస్కర్‌లను నియమించి మొత్తం ఉమ్మడి జిల్లా పోలీసు బాసులను ఏకకాలంలో మార్చింది. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం.. గత ఎన్నికల సమయంలో పనిచేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు లేదా మూడేళ్లకు మించి ఒకే కుర్చీలో విధులు నిర్వహిస్తోన్న పోలీసులకు స్థానచలనం తప్పేలా లేదు. ఈ విషయంలో ఇప్పటికే కొన్నిస్థానాల్లో ఎస్సై ర్యాంకు ఆఫీసర్లను ఉన్నతాధికారులు మార్చారు కూడా.

లేఖల కోసం ఏసీపీలు, సీఐల పైరవీలు..!

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం డీఎస్పీల జాబితాను ఇప్పటికే తెప్పించుకుంది. అదే సమయంలో కరీంనగర్, రామగుండం కమిషనరేట్లతోపాటు సిరిసిల్ల, జగిత్యాల పోస్టింగుల కోసం పలువురు డీఎస్పీలు ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా చాలాకాలంగా పోస్టింగులు లేకుండా లూప్‌లైన్లలో ఉంటున్న అధికారులు తమకు తెలిసిన నాయకుల ద్వారా ఈసారి ఎలాగైనా పోస్టింగ్ దక్కించుకోవాలని నేతల లేఖలు సంపాదించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు సైతం తాము పనిచేసే నియోజకవర్గం, జిల్లాను కుదిరితే జోన్ సైతం మారేందుకు వెనకాడటం లేదు. తమకు తెలిసిన నాయకుడు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా సరే.. వెళ్లి వెంటనే చేరిపోతున్నారు. ఇదే రకంగా ఇప్పటికే పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు జోన్లు మారి మరీ విధుల్లో జాయినయ్యారు.

కరీంనగర్‌లో విచిత్రం..!

కరీంనగర్ కమిషనరేట్ విషయానికి వస్తే.. ఇక్కడ పోలీసుల తీరు విచిత్రంగా ఉంటుంది. ఇక్కడే ఎస్సైలుగా సర్వీసులో చేరిన కొందరు ఇప్పటికీ ఏసీపీలుగా కొనసాగుతున్నారు. వీరికి బదిలీ గండం వెంటాడుతుండటంతో లూప్‌లైన్‌లోకి వెళ్లాలా? లేక అలవాటు ప్రకారం.. ఐదారు నెలలు మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లి.. సరిగ్గా ఎన్నికల ముందు తిరిగి రావాలా? అన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తానికి కరీంనగర్‌ను వదిలేందుకు వీరంతా ససేమీరా అంటున్నారు. అందుకే.. ఏ చిన్న అవకాశం దొరికినా.. దాన్ని సద్వినియోగపరచుకుని ఇక్కడే రిటైర్ అవ్వాలని కంకణం కట్టుకున్నారు.

అమ్మో..! ఆ నియోజకవర్గమా?

ఉమ్మడి జిల్లాలో మూడు జిల్లాల్లో విస్తరించిన ఓ నియోజకవర్గం పేరు చెబితేనే.. పోలీసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించాలంటే సిఫారసు లేఖలు తప్పనిసరి. వాటితో విధుల్లో చేరిన పోలీసులను ఇప్పటికీ సిఫారసు లేఖలు ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఆ నియోజకవర్గంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు 10 నెలలు డ్యూటీ చేసిన అనంతరం మరో అధికారికి ఆ స్థానంలో లేఖలు ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంలో ఇప్పటికే పలువురు ఎస్సై, సీఐలు చేతులు కాల్చుకున్నారు. తాజాగా కూడా ఈ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని సమాచారం. ఇటీవల కూడా జరిగిన బదిలీల్లోనూ ఇలాగే తమకు అన్యాయం జరిగిందని కొందరు, జరగనుందని మరికొందరు పోలీసులు బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఇంటలిజెన్స్ విభాగం ఇప్పటికే సీఎం కార్యాలయానికి సైతం చేరవేసిందని సమాచారం. అందుకే.. ఆ నియోజకవర్గం పేరు చెబితేనే.. పోలీసులు బెంబేలెత్తిపోతున్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తి అనుసరణీయం

- కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి కార్యక్రమం
- హాజరైన కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి, అధికారులు



నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని, ఆయన పోరాట స్ఫూర్తి అనుసరణీయమని కలెక్టర్ సంగీత, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కొమురయ్య జయంతిని నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక ఈ ప్రాంత పోరాటయోధులు, మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డితో పాటు జిల్లా అధికారులు, గొల్లకుర్మసంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దొడ్డి కొంరయ్య స్ఫూర్తిని చాటాలి: జెడ్పీ చైర్మన్

మంథని: దొడ్డి కొంరయ్య స్ఫూర్తిని నలువైపులా చాటాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథనిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. మంథనిలోని బొక్కలవాగు వంతెనపై దొడ్డి కొంరయ్య విగ్రహం పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపీపీ కొండ శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్, నాయకులు వేల్పుల గట్టయ్య, కొట్ట రమేశ్, గర్రెపల్లి సత్యం ఉన్నారు.

హద్దులు దాటి తవ్వకాలు..!

- నిబంధనలకు నీళ్లు
- ఇష్టారాజ్యంగా కంకర క్వారీలు
- అనుమతికి మించి దోపిడీపర్వం
- కాలుష్యం వెదజల్లుతున్న పరిసరాలు
- పట్టించుకోని అధికారయంత్రాంగం

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని కొన్ని కంకర క్వారీల నిర్వాహకులు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. చాలాచోట్ల అనుమతులకు మించి తవ్వకాలు చేపడుతున్నారు. అసైన్డ్ భూముల్లో.. అనుమతించిన స్థలాల పక్కనున్న భూములను కొనుగోలు చేసి.. వాటిల్లోనూ తవ్వకాలు చేస్తూ క్వారీలు నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. కంకర కోసం భారీ ఎత్తున తవ్విన గుంతలను అలాగే వదిలేయడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనునిత్యం యంత్రాలు నడుస్తుండడంతో పంట పొలాలపై దుమ్ము పడుతోంది. పేలుళ్ల శబ్దాలతో ఇళ్లకు బీటలు వారుతున్నాయి. అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న అపవాదు ఉంది. జిల్లాలో 29 క్రషర్ క్వారీలు, 45 బండ క్వారీలు పాలకుర్తి, పెద్దపల్లి, రామగిరి, ధర్మారం మండలాల పరిధిలో ఉన్నాయి. చాలాచోట్ల అనుమతులకు మించి తవ్వకాలు చేపడుతున్నారు. పాలకుర్తి మండలంలో కన్నాల బోడగుట్ట, జయ్యారం అంకమెట్టు గుట్టలపై మైనింగ్ క్వారీలు నడుస్తున్నాయి. మైనింగ్ లీజు యాక్ట్ ప్రకారం లీజుదారులకు కేటాయించిన పరిమితిని మించి బండరాళ్లను వెలికి తీస్తున్నారనే ఫిర్యాదు మేరకు దాదాపు గతేడాది క్రితం జిల్లా మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో బోడగుట్ట క్వారీల్లో అధికారులు సర్వే నిర్వహించారు. పరిమితికి మించి బండరాళ్లను వెలికితీసిన వారికి నోటీసులు జారీ చేశారు. మరోవైపు స్థానిక క్వారీలను ఆనుకుని ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్ల మూలంగా విపరీతమైన దుమ్ము ధూళి, శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. దీనిపై స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో ఇటీవల మంథని నియోజకవర్గం పరిధిలోని ముత్తారం మండల కేంద్రానికి చెందిన నాగినేని జగదీశ్వరరావు అనే వ్యక్తి పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా ఉన్న క్వారీలు, క్రషర్ల విషయమై దేశ రాజధాని ఢిల్లీలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి కార్యాలయం, విజిలెన్స్‌తోపాటు మొత్తం పది విభాగాల అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాజాగా సోమవారం ప్రజావాణిలో కన్నాల గ్రామంలోని స్టోన్ క్రషర్లు సిట్టింగ్ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉన్నాయని, క్వారీ లీజుదారులు లీజు గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా అక్రమ మైనింగ్ చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టి రిపోర్టు సమర్పించాలని ఆర్‌డీవోకు ఆదేశాలు జారీ చేశారు.



స్టోన్ క్రషర్లతో ప్రధాన రహదారిపై దుమ్ము



రహదారిని కమ్మేసిన క్రషర్ల దుమ్ము

ఇష్టారీతిన తవ్వకాలు

అనుమతులు లేకపోయినా.. స్టోన్ క్రషర్ అనుమతులు గడువు ముగిసినా.. వాటిని నడిపిస్తూ అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. చాలాక్రషర్‌లు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) మార్గదర్శకాలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వాతావరణంలోకి దుమ్ము,ధూళి కణాలను వెదజల్లుతుండటంతోపాటు అధిక మోతాదులో పేలుళ్లకు పాల్పడుతుండటంతో సమీప ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి 5 హెక్టార్లకు మించి మైనింగ్ చేయాలంటే తప్పకుండా స్థానిక ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేయాలి. గుట్ట నుంచి కంకర, గ్రానైట్ తీయాలంటే రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ, భూగర్భ గనుల శాఖ (మైనింగ్) నుంచి లీజుపత్రంతోపాటు పీసీబీ నుంచి కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్‌ఈ), కన్సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌వో) అనుమతులు తీసుకోవాలి. అవేవీ లేకుండానే పీసీబీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు కాంట్రాక్టర్లు నుంచి ‹మామూళ్లు› తీసుకుని వారికే మేలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. స్థానిక రాజకీయ నేతల అండదండలతో అధికారులపై చర్యలు తీసుకోకుండా ఒత్తిడి తీసుకొస్తున్నారనే ఆరోపణలున్నాయి

మార్గదర్శకాలు ఇవీ..

- టీఎస్‌ఐపాస్ ద్వారా అనుమతి తీసుకోవాలి. రెండేళ్లకోసారి అనుమతులు పునరుద్ధరించుకోవాలి.
- ఈ పరిశ్రమల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలి.
- 8మీటర్ల వరకు ఏపుగా మొక్కలు పెంచాలి
- క్రషర్ల నుంచి వచ్చే ధూళి చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించకుండా తరచూ నీటిని చల్లుతూ ఉండాలి.

ఇలాంటి నిబంధనలు ఉన్నా ఎవరూ పాటించటం లేదు. క్రషర్ల పరిశ్రమల చుట్టూ పొలాలు ఉండటంతో పంటలు పూర్తిస్థాయిలో ఎదగడం లేదు.

ఓసీపీ బ్లాస్టింగ్‌లతో ఆగమవుతున్న బతుకులు



వృద్ధురాలిని ఓదార్చుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: ఓసీపీ బ్లాస్టింగ్‌లతో సమీపంలోని ఇళ్లు బీటలు వారి ప్రజలు భయాందోళన మధ్య బతుకుతున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ తెలిపారు. సోమవారం స్థానిక రాంనగర్‌లో హాథ్‌సేహాథ్ జోడో చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రానున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. ఓసీపీలు ఏర్పాటు చేస్తే బొందలగడ్డగా మారుతుందని కేసీఆర్ అన్నారని, తీరా గెలిచాక ఓసీపీలనే ప్రారంభిస్తూ.. ఈ ప్రాంత ప్రజల బతుకులను నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వైఫల్యం వల్ల స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కరువైందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, ఎస్సీ, బీసీ, మైనార్టీ మహిళా విభాగం అధ్యక్షులతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మున్సిపల్ డ్రైవర్లు..

రామగుండం కార్పొరేషన్‌కు చెందిన పలువురు డ్రైవర్లు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి రాజ్‌ఠాగూర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఐటీయూ నాయకులు రవి, ఉదయ్, నాయకులు ఫరీద్, శ్రీనివాస్, మల్లేశ్, సలీం, బాలాజీ, సంతోష్, ఓదెలు, సురేందర్, రవికుమార్, మల్లేష్, చరణ్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లి మందలించిదని విద్యార్థి ఆత్మహత్య


అశ్విత్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీ సంతోష్‌నగర్‌కు చెందిన విద్యార్థి కనపర్తి అశ్విత్ (15) తల్లి మందలించిందని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. అశ్విత్ కాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లో సెల్‌లో గేమ్స్ ఆడుతుండడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంటి ఆవరణలో ఉన్న టార్పెంటాయిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. మృతుడి పెద్దనాన్న కనపర్తి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై శ్యామ్ పటేల్ తెలిపారు.

ఫిట్స్‌తో గర్భిణి మృతి


సమత(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కదంబాపూర్‌కు చెందిన ఆరేపల్లి సమత(29) గర్భిణి ఫిట్స్‌తో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం లింగాలదుద్దనపల్లికి చెందిన సమతకు కదంబాపూర్‌కు చెందిన అనిల్‌తో 11నెలల క్రితం వివాహమైంది. ఆరునెలల తర్వాత గర్భందాల్చిన విషయం తెలియడంతో తల్లిగారింటికి వెళ్లింది. గతనెల మార్చిలో సీమంతం కూడా ఘనంగా నిర్వహించారు. ఈనెల 1న అత్తగారింటికి వచ్చిన తర్వాత సమతకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడి నుంచి కరీంనగర్ తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ అదే రోజు మృతిచెందింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు సమత మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో అంత్యక్రియలు ఆలస్యం కాగా పోస్టుమార్టం నివేదికలో అనారోగ్యంతోనే మృతిచెందినట్లు తెలియడంతో సోమవారం తల్లిగారింటి వద్దే సమత అంత్యక్రియలు నిర్వహించారు. నిండు గర్భిణి మృతిచెందడంతో ఇరుకుటుంబాలు బోరున విలపించాయి.

కేశోరాంలో శ్రీగంధం దుంగల చోరీకి యత్నం

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం డెయిరీ ఫాంలోని శ్రీగంధం చెట్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నరికి దుంగలను ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. ఉదయం షిఫ్టు విధులకు హాజరైన కార్మికులు చెట్లు నరికి ఉండటాన్ని గమనించి కంపెనీ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గతంలోనూ డెయిరీఫాం, స్టాఫ్‌కాలనీ గెస్ట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లోని శ్రీగంధం చెట్లను నరికి దుంగలను ఎత్తుకెళ్లారు. దీనిపై బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు పురోగతి లేదు. ప్రస్తుతం మరోసారి డెయిరీఫాంలో గంధం చెట్లు నరికివేతకు గురికావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటనపై లిఖితపూర్వకంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ స్వంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డ్ / పాన్ కార్డ్‌లలో అతితక్కువ వడ్డీతో ఋణాలు ఇప్పించబడును. సంప్రదించండి : 9014653011. [H-793644]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K.ఫోన్: 9848571888 [H-793408]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

ప్రజా‘వాణి’ వినండి

- సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

పెద్దపల్లిరూరల్: ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అందిస్తున్న ఫిర్యాదులు, వినతులపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్ బాధితుల నుంచి 52 దరఖాస్తులు స్వీకరించారు. అందులో 41 దరఖాస్తులు రెవెన్యూ సంబంధమైనవే. పాలకుర్తి మండలం కన్నాలలో నిబంధనలకు విరుద్ధంగా క్రషర్లు కొనసాగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. రామగుండం కార్పొరేషన్ 26వ వార్డులో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న ఇంటినిర్మాణం ఆపాలంటూ కొందరు ఫిర్యాదు చేశారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్

భూ రికార్డులు మార్చారు..



మారెడుగొండ గ్రామంలో సర్వే నంబరు 286, 298/2లో గల మా భూమిని ఇతరుల పేరిట పట్టా చేశారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా మా భూమి మా పేరిట చేయలేదు. కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవిస్తే సమస్య పరిష్కారం అవుతుందని వచ్చా.
– సయ్యద్ సలీం, మారెడుగొండ, పెద్దపల్లి మండలం

పట్టాలిచ్చారు.. హద్దులు చూపాలి



గ్రామానికి చెందిన 66మంది పేదలకు 24గుంటల చొప్పున ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఇప్పటి వరకు హద్దులు చూపలేదు. దీన్ని ఆసరా చేసుకుని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. విచారణ జరిపి హద్దులను నిర్ణయించి మాకు అప్పగించాలి.
– ఇస్లావత్ లక్ష్మి, భీమ్లానాయక్ తండా, పాలకుర్తి మండలం

డబుల్ బెడ్‌రూం ఇల్లివ్వండి



ఏ ఆధారమూ లేని నాకు డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పించాలి. ప్రభుత్వం పేదల కోసం కట్టిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఓ గదిని కేటాయించి ఆదుకోవాలి. – ఈదునూరి శాంత, తుర్కలమద్దికుంట, పెద్దపల్లి మండలం

పింఛన్ పునరుద్ధరించండి



వృద్ధాప్యంపైబడింది. పైగా దివ్యాంగుడిని. ఇప్పటివరకు పింఛన్ అందేది. కొద్ది నెలలనుంచి ఆపేసింద్రు. పింఛన్ సొమ్ముతోనే నేను బతికేది. ఆగిపోయిన పింఛన్ మళ్లీ అందేలా చూసి ఆదుకోవాలి. – గుంజపడుగు లక్ష్మయ్య, కమాన్‌పూర్

‘పుట్ట’, ‘పూదరి’పై చర్యలు తీసుకోండి

రామగిరి(మంథని): తమను భయభ్రాంతులకు గురిచేసున్న జెడ్పీ చైర్మన్ పుట్టమధు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క, కొమురయ్యగౌడ్ దంపతులు కోరారు. ఈమేరకు ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. తాను మహిళనని చూడకుండా సోషల్‌మీడియా వేదికగా రాతలు రాస్తూ తమ పరువుకు భంగం కలిగించారని, జెడ్పీ చైర్మన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీటీసీ కాపురబోయిన శ్రీదేవికి తమ నుంచి రూ.10లక్షలు ఇప్పించి.. ఆమెకు వైస్ ఎంపీపీ పదవి ఇప్పించారని ఆరోపించారు. మిగిలిన ఎంపీటీసీలకు రూ.2లక్షల చొప్పున ఇవ్వాలంటే ఐదెకరాల వ్యవసాయ భూమిని అమ్ముకున్నామని పేర్కొన్నారు. అయినా పార్టీకి ఎక్కడా ఇబ్బంది కలిగించేలా వ్యవహరించలేదన్నారు. బీఆర్ఎస్ ఒకవైపు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే.. మంథని నియోజకవర్గంలో మాత్రం పుట్టమధు బ్రాహ్మణిజం, బహుజనవాదం అంటూ ప్రజల్లో చీలికలు తెచ్చేలా ముందుకు సాగుతున్నారన్నారు. స్పందించిన మంత్రులు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చినట్లు పేర్కొన్నారు.


మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ దేవక్క దంపతులు

ఆరునెలలే గడువు

- వాహనాలు తీసుకోకుంటే వేలం
- వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు
- పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లండి
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి


రెమా రాజేశ్వరి

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోని పట్టుబడిన వాహనాలను ఆరునెలల్లోగా సంబంధిత పత్రాలు చూపించి తీసుకెళ్లాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం వివరాలు వెల్లడించారు. యాజమానులు తీసుకెళ్లకుండా ఉన్న వాహనాలు, గుర్తుతెలియని వాహనాలను వేలం వేసేందుకు ఆరునెలల గడువు మాత్రమే ఉందన్నారు. రెండు జిల్లాలకు చెందిన వాహనాలను బెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు తరలించామని, మొత్తంగా 81 వాహనాలు వేలంవేయాలని నిర్ణయించామన్నారు. వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను రామగుండం కమిషనరేట్ పోలీస్‌శాఖ అధికారిక వెబ్‌సైట్ www.ramagundampolice.in, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం ఆర్.ఐ. మధుకర్(8712656616), ఆర్ఐ అంజన్న (8712656621)ను సంప్రదించాలన్నారు.

డీసీపీఓకు శిశువు అప్పగింత

- ఆడశిశువు, తక్కువ బరువు, ఆర్థిక ఇబ్బందులు..
- వెరసి శిశువును వదిలించుకున్న కన్నతల్లి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైద్య సిబ్బంది


శిశువును అప్పగిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

కోల్‌సిటీ: ఆడశిశువు... తక్కువ బరువు... అప్పటికే ఆర్థిక ఇబ్బందులు.. వెరసి తమ కుటుంబ పోషణ భారమవుతుందని కేజీ బరువుతో జన్మించిన ఆడశిశువును ప్రసవించిన రోజే కన్నబిడ్డను వదిలించుకున్న తల్లి... ఈ ఘటన నాలుగు నెలల క్రితం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రామగుండం ప్రభుత్వాస్పత్రిలో తక్కువ బరువుతో పుట్టిన ఓ శిశువును బాలింత వదిలేసి వెళ్లడంతో ఆస్పత్రి అధికారులు, సిబ్బంది అన్నీతామై నాలుగు నెలలు కంటికి రెప్పలా కాపాడి బరువు పెరిగేలా కృషి చేశారు. ఈమేరకు సోమవారం సదరు శిశువును జిల్లా మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమశాఖ విభాగంలోని మిషన్ వాత్సల్య అధికారులకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది నవంబర్ 12న జీజీహెచ్ ఆస్పత్రిలో ఓ గర్భిణీని ప్రసవం కోసం కుటుంబసభ్యులు అడ్మిట్‌చేశారు. అదే రోజు ఆడ శిశువుకు జన్మనివ్వగా కేజీ బరువు మాత్రమే ఉండడం, అందులో ఆడ శిశువు కావడం, అప్పటికే ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తాము ఆబిడ్డ ఆరోగ్యం బాగుచేయడానికి ఖర్చులు భరించలేమంటూ వైద్యసిబ్బందికి చెప్పి శిశువును వదిలేసి వెళ్లిపోయారు. అనంతరం వైద్యసిబ్బంది పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆస్పత్రి అధికారులు, నర్సింగ్ స్టాఫ్ స్పందించి శిశువును చేరదీశారు. ఎస్ఎన్‌సీయూ వార్డులో అడ్మిట్‌చేసి నాలుగు నెలలు ప్రత్యేక చికిత్స అందిస్తూనే ఆలనాపాలనా చూశారు. సోమవారం వరకు శిశువు బరువు 3.540 కేజీలు పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డీసీపీఓ అధికారులకు అప్పగించారు. నాలుగు నెలలు కన్నకూతురిలా కంటిరెప్పలా కాపాడి, ఆలనాపాలనా చూసిన వైద్యసిబ్బంది అధికారులకు అప్పగిస్తుండగా కంటతడి పెట్టారు. ఈ మేరకు కరీంనగర్‌లోని స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీకి అప్పగించనున్నట్లు శిశువును స్వాధీనం చేసుకున్న డీసీపీఓ కమలాకర్, పీఓ కనకరాజ్, శ్యామల వెల్లడించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ప్రిన్సిపాల్ హిమబిందు అభినందించారు. కార్యక్రమంలో గైనిక్ హెచ్ఓడీ శిరోమణి, పిల్లల వైద్య నిపుణురాలు శ్రీలత, ఆర్ఎంఓ అప్పారావు, అనాటమి హెచ్ఓడీ అనిల్‌రాహుల్, నర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి


మాట్లాడుతున్న సునిల్

పెద్దపల్లిరూరల్: బీసీ కులగణన చేపట్టాలని, జనాభా ప్రాతిప్రదికన 52శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సునిల్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో 68 రోజులుగా సాగుతున్న రిలేదీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించారు. పోరాటాలకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. తిరుపతి, సతీశ్, శ్రీనివాస్, గద్దంశేషాద్రి, సాధిక్, రవి ఉన్నారు.

‘భట్టి’ పీపుల్స్‌మార్చ్‌లో విజయ్



పెద్దపల్లిరూరల్: హథ్‌సేహాథ్ జోడోలో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా చెన్నూరులో సాగిన పీపుల్స్ మార్చ్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పెద్దపల్లిరూరల్: మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ఆరోగ్య కేంద్రాల ద్వారా మహిళలను ఆరోగ్యవంతులను చేయాలని కలెక్టర్ సంగీత అన్నారు. మహిళారోగ్య కేంద్రాల నిర్వహణతీరుపై సమీక్షించారు. మహిళలందరికీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలన్నారు. డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ఎస్ శ్రీధర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

18న వేజ్‌బోర్డు సమావేశం

గోదావరిఖని: 11వ వేజ్‌బోర్డు సమావేశం ఈనెల 18న కోల్‌కత్తాలో నిర్వహిస్తున్నట్లు జాతీయ కార్మిక సంఘాల నాయకులు, పర్మినెంట్ వేజ్‌బోర్డు మెంబర్లు సీతారామయ్య, జనక్‌ప్రసాద్, ఆల్టర్‌నేటివ్ వేజ్‌బోర్డు మెంబర్లు మాధవనాయక్, నర్సింహారావు, రియాజ్‌అహ్మద్ తెలిపారు. అలవెన్స్‌లు, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ చర్చించే అవకాశం ఉంది.

పదేళ్లు దాటితే ఆధార్ కార్డు అప్‌డేట్ తప్పనిసరి

పెద్దపల్లిరూరల్: ఆధార్‌కార్డు పొంది పదేళ్లు దాటితే అప్‌డేట్ చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆధార్ కార్డు అప్‌డేట్‌కు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. అప్‌డేట్ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రచారం చేయాలన్నారు. బ్యాంకు ఖాతా లావాదేవీలు, ఉపకారవేతనాలు, ఇన్‌కంటాక్సు, బ్యాంకు రుణాల వంటి సేవలకూ ఆధార్‌కార్డు అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఎలిగేడు, జూలపల్లి, ముత్తారం మండలాల్లో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం లేక ఇబ్బందులున్నాయని అధికారులు జేసీ దృష్టికి తెచ్చారు. శాశ్వత ఆధార్‌కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రతిపాదనలను రూపొందించి ఆమోదించాల్సిందిగా కమిషనర్‌కు లేఖ రాయాలని సూచించారు.

నందిమేడారంలో మంత్రి ఎర్రబెల్లికి ఘన స్వాగతం


స్వాగతం పలుకుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు

ధర్మారం: అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు వెల్గటూర్ వెళ్లిన పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మండలంలోని నందిమేడారం వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రులు దయాకర్‌రావు, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నంది పంప్‌హౌజ్ వద్దకు చేరుకోగానే సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పెద్దపల్లి, జగిత్యాల జెడ్పీ చైర్మన్లు పుట్ట మధుకర్, దావ వసంత, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, జిల్లా సహకార సంఘాల ఫోరం చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, రైతు బంధు సమితి జిల్లా సభ్యులు పుస్కూరి రామారావు, ఎగ్గెల స్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

- ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్


మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులు, పారిశ్రామిక ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. లాభాల్లో నడుస్తున్న సింగరేణి కార్మికులకు శుద్ధనీరు అందించకపోవడం బాధాకరమన్నారు. మెడికల్ బోర్డు కాలపరిమితిని నాలుగేళ్లకు పెంచితే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. రీజియన్‌లోని మూడు డివిజన్ల కార్మికులవాడలకు స్వచ్ఛమైన తాగునీటి కోసం సీఎండీని కోరగా రూ.20 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. నాలుగేళ్లు గడుస్తున్నా.. గుర్తింపు ఎన్నికలు నిర్వహించకపోవడం సరికాదన్నారు. డివిజన్ ఉపాధ్యక్షుడు అక్బర్ అలీ, నరసింహారెడ్డి, ధర్మపురి, మార్కండేయ, చాట్ల సదానందం, తిరుపతి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత జేఎన్‌టీయూహెచ్

రామగిరి: సెంటినరీకాలనీ జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న బీ జోన్‌స్థాయి క్రికెట్ టోర్నీలో జేఎన్టీయూ కళాశాల విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్‌మ్యాచ్ జేఎన్టీయూ కళాశాల, కరీంనగర్‌కు చెందిన శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల మధ్య హోరాహోరీగా సాగింది. శ్రీ చైతన్య కళాశాల జట్టుపై జేఎన్టీయూ కళాశాల జట్టు పది పరుగుల తేడాతో గెలుపొందింది విజేతగా నిలిచింది. జేఎన్టీయూ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులు చేయగా కెప్టెన్ ఉమేశ్ 60 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీ చైతన్య జట్టు 20 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌట్ అయింది. సూర్య నాలుగు వికెట్లు, ఉమేశ్ మూడు వికెట్లు తీసి గెలుపులో కీలక భూమిక పోషించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి, డీఈఈ సతీశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్ పింగిలి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటిన్యూస్‌మైనర్ల ద్వారా లక్ష్యాలు సాధించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్జీ–2 జీఎం

గోదావరిఖని: భూగర్భగనుల్లో ప్రవేశపెట్టిన కంటిన్యూస్‌మైనర్ యంత్రాల ద్వారా నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని డైరెక్టర్లు బలరాం, ఎన్‌వీకే.శ్రీనివాస్ సూచించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వకీల్‌పల్లి గని కంటిన్యూస్ మైనర్‌కు కేటాయించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికి, ఉత్పత్తి పెరుగుదలకు తీసుకుంటున్న ప్రణాళికలను జీఎం వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం మురళీకృష్ణ, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఎన్టీపీసీ చేయూత


బెంచీలు అందిస్తున్న ఈడీ సునిల్‌కుమార్

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ ప్రభావిత, పునరావాస గ్రామాలకు చేయూత అందిస్తోందని ప్రాజెక్టు ఈడీ సునిల్‌కుమార్ తెలిపారు. స్థానిక టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కరీంనగర్ జిల్లా జైలు నుంచి మొత్తం 500 డెస్క్‌కంబెంచీలు కొనుగోలు చేసి పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించేందుకు సంస్థ తోడ్పాటు అందిస్తుందన్నారు. ఖైదీలు తయారుచేసే ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతున్నట్లు వెల్లడించారు.

ఢిల్లీ నిరసనలో పెద్దపల్లి బీసీ నేతలు


ఆర్.కృష్ణయ్యతో పెద్దపల్లి బీసీనేతలు

పెద్దపల్లిరూరల్: బీసీ కులగణన చేపట్టాలని, 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు దాసరి హనుమయ్య, శ్రీమన్నారాయణ, బొద్దుల అరుణ, సురేశ్, నాగరాజు, సతీష్‌కుమార్, లక్ష్మి, మనోహర పాల్గొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఇచ్చిన హలో బీసీ.. చలోఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి బీసీ గణన, రిజర్వేషన్ల పెంపు సాధిస్తామని నాయకులు హనుమయ్య, శ్రీమన్నారాయణ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా కార్మికుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని బొంతకుంటపల్లి గ్రామశివారు రాజీవ్ రహదారిపై సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డుప్రమాదంలో ఒడిస్సాకు చెందిన ఇటుకబట్టీ కార్మికుడు డినా(48) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఏబీసీ ఇటుకబట్టీలో కార్మికుడిగా పనిచేస్తుండగా సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డినా అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కొడుకు కీర్తన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మావోయిస్టు నేత తల్లి మృతి


వెంకమ్మ(ఫైల్)


నివాళులు అర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు

పాలకుర్తి: మండలంలోని రాణాపూర్‌కు చెందిన మావోయిస్టు దండకారణ్యం రాష్ట్రకమిటీ సభ్యుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ కమలాకర్ తల్లి ఏగోలపు వెంకమ్మ (85) సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. వెంకమ్మకు నలుగురు కుమారులు కాగా చిన్న కుమారుడు మల్లయ్య 30ఏళ్ల క్రితం మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. వెంకమ్మ మృతదేహాన్ని మాజీ మావోయిస్టులు, రైతుసంఘాల నాయకులు, పౌరహక్కుల నేతలు సందర్శించారు. ఆమె మృతదేహంపై ఎర్ర, పచ్చజెండాలు కప్పి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పాటలతో వెంకమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.